క్లుప్తంగా

ప్రొద్దుటూరులో ఉచిత వైద్య శిబిరం



కంకిపాడు: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన బొట్ట వెంకట రమణారెడ్డి జయంతి సందర్భంగా టాప్ స్టార్ హాస్పిటల్ సౌజన్యంతో గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో సాధారణ వ్యాధులకు ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. 120 రోగులకు వైద్య పరీక్షలు చేయించారు. శిబిరాన్ని భీమవరపు లక్ష్మణ్‌రెడ్డి, బొట్ట వినోద్‌రెడ్డి, భీమవరపు రమేష్, భీమవరపు రాజగోపాల్‌రెడ్డి, జంగా వెంకట రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు గోపవరపుగూడెంలో ఉచిత దంత వైద్య శిబిరం

గన్నవరంరూరల్: మండలంలోని గోపవరపుగూడెం గ్రామ సచివాలయం వద్ద మంగళవారం ఉదయం 9 గంటలకు ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ నల్లూరు వెంకటేశ్వరరావు తెలిపారు. చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో వైద్యులు సేవలందిస్తారని, గ్రామస్తులు, పరిసర గ్రామాల ప్రజలు దంత వైద్య చికిత్సలు పొందాలని సూచించారు.

పేరంటాలమ్మకు యార్లగడ్డ ప్రత్యేక పూజలు



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో ఉన్న పేరంటాలమ్మ తిరునాళ్ల సందర్భంగా కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ యార్లగడ్డ వెంకట్రావు సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద ఉన్న అంకమ్మ తల్లి పురాన్ని సందర్శించారు. భ్రమరాంబ చాలీసా భజన సమాజం వారు ఏర్పాటు చేసిన భజన కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో నున్న పాలకేంద్రం అధ్యక్షుడు బొంతు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ భూముల బాలశేఖరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భీమవరపు సుధీర్ రెడ్డి, రాజశేఖర్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా రామవరప్పాడులో వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ ఉపసర్పంచ్ కొల్లా ఆనంద్‌కుమార్ ,పలువురు వార్డు సభ్యులు, నాయకులను కలిసి యార్లగడ్డ వెంకట్రావు కొద్ది సేపు ముచ్చటించారు.

పాలశీతల కేంద్రం మేనేజర్‌కు ఘన వీడ్కోలు



హనుమాన్‌జంక్షన్ రూరల్: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. హనుమాన్‌జంక్షన్ పాల శీతల కేంద్రం మేనేజర్‌గా పనిచేస్తున్న వీరమాచినేని విజయ సంపత్‌కుమార్ చిల్లకల్లు బదిలీకావటంతో ఆయనకు స్థానిక కాకాని భవన్‌లో సోమవారం ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చలసాని మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో పాడిరైతులకు, మార్కెటింగ్ ఏజెంట్లకు సంపత్‌కుమార్ అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. హనుమాన్‌జంక్షన్ పాలశీతల కేంద్రం అభివృద్ధిలో తనదైన ముద్రను చాటుకున్నారని కొనియాడారు. అనంతరం సంపత్‌కుమార్‌ను పలువురు సూపర్‌వైజర్లు, పాల సొసైటీల అధ్యక్షులు, వేతన కార్యదర్శులు పూలమాలలు, దుశ్శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. నూతన మేనేజర్ కిలారు కిరణ్‌కుమార్, కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ పిన్నమనేని లక్ష్మీప్రసాద్, గన్నవరం ఫీడ్ ప్లాంట్ డైరెక్టర్ తుమ్మల రామారావు పాల్గొన్నారు.

8న 'రన్‌ఫర్ జీసస్'ను జయప్రదం చేయండి

గుడివాడటౌన్: ప్రపంచ శాంతి కొరకు నిర్వహిస్తున్న రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం విజయవంతం చేయాలని క్రైస్తవ సంఘాల ప్రతినిధులు కోరారు. స్థానిక నాగవరప్పాడు రివైవల్ పెంతుకోస్తు చర్చి ఆవరణలో వివిధ సంఘాలకు చెందిన పాస్టర్లు, ప్రతినిధులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 8వ తేదీ ఉదయం 5.30 గంటలకు నాగవరప్పాడు నుంచి ఏలూరు రోడ్డు, నెహ్రూచౌక్, మార్కెట్ సెంటర్, బస్టాండ్ మీదుగా పామర్రు రోడ్డులోని ఆర్సీఎం చర్చి వరకు రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. క్రైస్తవ విశ్వాసులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. బిషప్ రెవరెండ్ అప్పికట్ల జాషువా, రెవరెండ్ సజ్జా బర్నబాస్, పాస్టర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం

కంకిపాడు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా విద్యాశాఖ సమర్థంగా చర్యలు తీసుకుంది. మండలంలోని వివిధ గ్రామాల్లో 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. 1422 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 1410 మంది విద్యార్థులు హాజరయ్యారు. 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 8.45 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిచ్చారు. 9.30 గంటల నుంచి పరీక్ష ప్రారంభమైంది. పరీక్ష కేంద్రంలోకి అనుమతిచ్చే సమయంలో విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి లోనికి అనుమతించారు. విద్యార్థుల వద్ద ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫోన్‌లు, వాచ్‌లు, తినుబండారాలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

ఉన్నతాధికారుల తనిఖీలు..

పరీక్ష కేంద్రాలను పలువురు ఉన్నతాధికారులు తనిఖీలు చేశారు. మండలంలోని ఈడుపుగల్లు, పునాదిపాడు జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను డీఈఓ తాహెరా సుల్తానా సందర్శించారు. పాఠశాలల్లో పరీక్షల నిర్వహణకు తీసుకున్న చర్యలను తనిఖీ చేశారు. సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు ఇచ్చారు. కంకిపాడు, పునాదిపాడు పరీక్ష కేంద్రాలను గన్నవరం డీఎస్పీ కైలే విజయపాల్ సందర్శించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కె.సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరం రూరల్‌లో..

గన్నవరంరూరల్: మండలంలోని జెడ్పీ హైస్కూళ్లలో, ప్రయివేటు పాఠశాలల్లో సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ముస్తాబాద జెడ్పీ హైస్కూల్‌లో 128 మంది, గొల్లనపల్లిలో 136, గన్నవరం గరల్స్ హైస్కూల్ 185, బాలుర హైస్కూల్ 222, వీరపనేనిగూడెం 145, దావాజీగూడెం 169, ఎల్‌ఎల్‌ఎఫ్‌సీ పాఠశాలలో 142 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఎంఈవో బి.శ్రీనివాస్ తెలిపారు. 22మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు వివరించారు. గొల్లనపల్లి జెడ్పీహైస్కూల్‌లో 10వ తరగతి పరీక్ష కేంద్రం తొలిసారిగా ప్రారంభం కావటంతో తల్లిదండ్రులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో ఈ పాఠశాల విద్యార్థులు ఎంతో దూరంగా ఉన్న వీరపనేనిగూడెం వెళ్లి పరీక్షలు రాసేవారు.



యనమలకుదురులో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు



కంకిపాడు జెడ్పీ పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్పీ కైలే విజయపాల్



ఉయ్యూరు పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్‌ఐ వీరప్రసాద్

గన్నవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు పరీక్షకు మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. గొల్లనపల్లి హైస్కూల్‌లో 137 మంది విద్యార్థులకు 136 మంది, ముస్తాబాద హైస్కూల్‌లో 129 మందికి 128 మంది, గన్నవరం బాలికోన్నత పాఠశాలలో 190 మందికి 185 మంది, గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలలో 229 మంది విద్యార్థులకు 222 మంది హాజరయ్యారు. వీరపనేనిగూడెం హైస్కూల్‌లో 146 మందికి 145 మందికి, దావాజీగూడెం స్కూల్‌లో 174 మందికి 169 మంది, గన్నవరం స్కూల్‌లో 144 మందికి 142 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు.

పెనమలూరులో..

పెనమలూరు: మండల పరిధిలో 10 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు కలిపి 2,073 మంది పరీక్షకు హాజరు కావల్సి ఉంది. అయితే 2,059 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 14 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్ నుంచి పరీక్ష పత్రాలు సకాలంలో పరీక్ష కేంద్రాల వద్దకు అధికారులు చేర్చారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా రావటంతో హడావుడి చోటు చేసుకుంది. ఎంపీడీఓ సునీతాశర్మ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ఉయ్యూరులో..

ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణంలో 5, మండలంలో రెండు పరీక్ష కేంద్రాల్లో సోమవారం పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఏడు కేంద్రాల్లో 1297 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 1288 మంది విద్యార్థులు హాజరయ్యారు. తొమ్మిది మంది గైర్హాజరయ్యారని ఇన్‌చార్జి ఎంఈఓ కనకమహాలక్ష్మి తెలిపారు. తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి, బందోబస్తు ఏర్పాట్లను ఎస్‌ఐ వీరప్రసాద్ పర్యవేక్షించారు. పలు కేంద్రాల్లో తహసీల్దార్ మస్తాన్ తనిఖీలు నిర్వహించారు.

ఉంగుటూరులో 585 మంది హాజరు

ఉంగుటూరు: మండల వ్యాప్తంగా ఉన్న ఏడు పరీక్ష కేంద్రాల్లో పది పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. 5 ప్రభుత్వ జెడ్పీ హైస్కూళ్లు, 2 ప్రైవేటు హైస్కూళ్లలో ఏర్పాటుచేసిన ఏడు కేంద్రాల్లో 602మంది పదవ తరగతి విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 585 మంది హాజరయ్యారు. 17మంది గైర్హాజరు అయినట్లు ఎంఈవో వెంకటేశ్వరరావు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద అన్ని వసతులు, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

టెన్త్ తెలుగు పరీక్షకు 22 మంది గైర్హాజరు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని మొత్తం 760 మంది టెన్త్ విద్యార్థులు ఉండగా, వీరి కోసం 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. తెలుగు పరీక్షకు 738 మంది హాజరు కాగా, 22 మంది గైర్హాజరయ్యారు. బాపులపాడు జెడ్పీ హైస్కూల్ ఎ-సెంటర్‌లో ఇద్దరు, బి-సెంటర్‌లో 9 మంది, సాయి గౌతమ్ స్కూల్‌లో ఒకరు, సిద్ధార్థ విద్యాలయ పరీక్ష కేంద్రంలో 9 మంది, వీరవల్లి జెడ్పీ హైస్కూల్ కేంద్రంలో ఒకరు గైర్హాజరైనట్లు ఎంఈవో సక్సేనా రాజు తెలిపారు.

వైఎస్సార్ పింఛన్ల పంపిణీ



తెంపల్లిలో లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్, గృహసారథి

గన్నవరం రూరల్ మండలంలోని గ్రామాల్లో సోమవారం వలంటీర్‌లు ముమ్మరంగా వైఎస్సార్ పెన్షన్‌లు పంపిణీ చేశారు. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు పెన్షన్‌లను వలంటీర్‌లు, గృహసారథులు కలసి వెళ్లి అందజేశారు. సోమవారం మధ్యాహ్నం నుంచి పెన్షన్‌ల పంపిణీ ప్రారంభించి, పలు గ్రామాల్లో సాయంత్రానికి పూర్తిగా అందజేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



గంగూరులో ఆర్థిక సాయం అందిస్తున్న అక్బర్ బాషా

పెనమలూరు: గంగూరులో మృతి చెందిన వెలిశల కిషోర్ అనారోగ్యంతో మృతి చెందటంతో అతని కుటుంబానికి వైఎస్సార్ సీపీ నేతలు సోమవారం ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి చెందిన కిషోర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందటంతో వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ సరంపచి తస్లీమున్నీసా సహకారంతో ఆమె భర్త అక్బర్‌బాషా రూ.10 వేల సాయం అందించారు.

మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న గొల్లపూడి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు

రామవరప్పాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు అధిక ప్రాముఖ్యం ఇస్తున్నారని గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మాదు శివరామకృష్ణ అన్నారు. విజయవాడ రూరల్ మండలంలోని తొమ్మిది గ్రామాలకు సంబంధించి వైఎస్సార్ ఆసరా మూడవ విడత కార్యక్రమాన్ని సోమవారం ప్రసాదంపాడు ఎస్‌సీఆర్ సెంటర్‌లోని అన్నపూర్ణ రైస్‌మిల్లు ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో మొత్తం 1303 గ్రూపుల్లోని 12,936 సభ్యులకు రూ.12,91,99,140 చెక్కును పొదుపు సంఘాల మహిళలకు గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ, గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు తదితరులు అందజేశారు. ఈ సందర్భంగా మాదు శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు జగనన్న వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడు విడతల్లో రూ.19వేల కోట్లను మహిళల ఖాతాల్లో జమ చేశారన్నారు. గొల్లపూడి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక జగన్‌పై టీడీపీ నాయకులు దుష్ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మనందరి భవిష్యత్ కోసం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో లిడ్‌క్యాప్ డైరెక్టర్ కోనేరు సత్యప్రియ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మార్కాపురం కనకారావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్. వెంకటేశ్వరరావు, గన్నవరం మార్కెట్‌యార్డ్ చైర్మన్ రామిశెట్టి అంజనీ కుమారి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దేవగిరి ఓంకార్ రెడ్డి, నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు, ఎంపీడీవో శేషగిరిరావు, ఏపీఎం చంద్రశేఖర్, రామవరప్పాడు సొసైటీ చైర్మన్ సాదం వెంకటేశ్వరరావు, రామవరప్పాడు కన్వీనర్ సమ్మెట సాంబశివరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి



యనమలకుదురులో పోషణ్ పక్వాడా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



చలివేంద్రపాలెంలో పోషణ్‌పక్వాడా కార్యక్రమంలో ఐసీడీఎస్ కార్యకర్తలు

పెనమలూరు: యనమలకుదురు సెక్టార్‌లో సోమవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పోషక విలువలు కలిగిన ఆహారం ఎలా తయారు చేసుకోవచ్చో వివరించారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, మునగాకుతో తక్కువ ఖర్చుతో పోషక విలువలు కలిగిన ఆహారం తయారు చేసుకునే విధానాన్ని తల్లులకు అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసి చూపించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడాపై అవగాహన

కంకిపాడు: పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు సూపర్‌వైజర్ అన్నామణి సూచించారు. మండలంలోని చలివేంద్రపాలెం గ్రామంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కంకిపాడు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు చిరుధాన్యాలతో తయారు చేసిన పిండి వంటకాలు, ఆహార పదార్థాలను ప్రదర్శించారు. పౌష్టికాహారం తీసుకోవటం ద్వారా రక్తహీనత సమస్యను అధికమించొచ్చని అన్నామణి సూచించారు. ప్రాజెక్టు ప్రతినిధులు రమాదేవి, నళినీకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోషణ్ పక్వాడా ర్యాలీ నిర్వహించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి..

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాలింతలు, గర్భిణులు, చిన్నపిల్లల తల్లులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ గన్నవరం సీడీపీవో పి.వెంకటలక్ష్మి అన్నారు. బాపులపాడు మండలం ఎ.సీతారామపురం, రామన్నగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహార పక్షోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఎ.సీతారామపురం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీవో వెంకటలక్ష్మి మాట్లాడుతూ పౌష్టికాహార లోపం వల్ల గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత కలుగుతుందని చెప్పారు. పిల్లల పెరుగుదల లోపం, వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు లేకపోవటం వంటి సమస్యలు కలుగుతాయని ఆమె తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందరికీ పౌష్టికాహారం అందేలా చూద్దాం- సర్పంచ్ బి.గణేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎల్.దుర్గాదేవి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలి

పెదపారుపూడి: గ్రామాల్లో ఉన్న ప్రజా సమస్యలను అధికారులు చిత్తశుద్ధితో పని చేసి పరిష్కరించాలని ఎంపీపీ గోగం సురేష్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత ఎంపీడీఓ అజెండాను సమావేశంలో చదివి వినిపించారు. గ్రామాల వారీగా ప్రజా ప్రతినిధులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీరు సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి నిర్మిస్తున్నారన్నారు. కొంత మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రావడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. మండల స్థాయి అధికారులు స్పందించి లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు పొనుగుమాటి రజిని, వెలగల పద్మ, ఎంపీటీసీలు చిగురుపాటి అశోకకుమారి, చదలవాడ పద్మ, సర్పంచ్‌లు పుణుకొల్లు శివరామప్రసాద్, నాగదేశి సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ వి.నాగభూషణం, ఎంపీడీఓ టి.సీతామహాలక్ష్మి, ఈఓపీఆర్డీ ఎం.నాగిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ఉచితంగా అందజేత



ఉంగుటూరు: పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కు సిద్ధమవుతున్న ఇద్దరు విద్యార్థులకు రూ.1.30 లక్షల విలువగల రెండు ల్యాప్‌టాప్‌లను పొట్టిపాడు వన్‌వే మిషన్ అధినేత కొడాలి జోయల్ సుగుణాకర్ సోమవారం అందజేశారు. అమృతలూరుకి చెందిన తోడేటి కిషోర్, నారా అప్పారావు పేటకు చెందిన బేబీలకు జోయల్ సుగుణాకర్ ల్యాప్‌టాప్‌లు బహూకరించారు.

కనులపండువగా శత జయంతి బ్రహ్మోత్సవాలు

వానపాముల(పెదపారుపూడి): మండలంలోని వానపాముల గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ అలివేలు మంగా సమేత శ్రీవెంకటేశ్వర స్వామి శత జయంతి బ్రహ్మోత్సవాలు సోమవారం కనులపండువగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. వేద పండితులు అష్టోత్తర శత కలశాభిషేకం చేశారు. ఆలయం నిర్మించి 100 ఏళ్లు పూర్తి కావటంతో గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలు కుటుంబ సమేతంగా వచ్చి స్వామి బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో తిలకించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని కుంకుమ పూజలు చేశారు.

ఆటిజం రుగ్మతపై అవగాహన

గూడూరు: మంద బుద్ధి (ఆటిజం)ని ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా జీవన నాణ్యత మెరుగుపర్చుకోవచ్చని గూడూరు మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.అనురాధ అన్నారు. ఏప్రిల్ 2 వరల్డ్ ఆటిజం ఎవేర్‌నెస్‌డే సందర్భంగా గూడూరు నాన్‌భవిత కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం గూడూరు మెయిన్ స్కూలులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆటిజం అనేది మెదడు అభివృద్ధిని ప్రభావితం చేసే రుగ్మతల్లో ఒకటన్నారు. దీన్ని ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా వారికి తగిన తోడ్పాడు అందించి, వారిలో జీవన ప్రమాణాలు మెరుగుపర్చడానికి అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ రమాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ అనే విద్యార్థికి రోలేటర్‌ను పంపిణీ చేశారు.

7 ఎకరాల వరి కుప్పలు దగ్ధం



ఉరుటూరు(పామర్రు): గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు వరి కుప్పలకు నిప్పు అంటించిన సంఘటన పామర్రు మండలం ఉరుటూరు గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన చెన్ను సాయితేజ, కొడాలి త్రినాథ్‌లకు చెందిన 7 ఎకరాల పొలాన్ని పామర్రుకు చెందిన గుడివాడ సత్య ప్రసాద్ అనే వ్యక్తి కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రస్తుతం మినుము పంట ఉన్నందున మినుము నూర్చిన తర్వాత వరి కుప్పలు తీద్దామని అనుకుంటున్నారు. సోమవారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో కొందరు దుండగులు 7 ఎకరాలకు చెందిన నాలుగు వరి కుప్పలకు నిప్పు అంటించి అక్కడి నుంచి పారిపోయారు. తెల్లవారుజామున 5 గంటల సమయంలో ప్రసాద్ పొలాన్ని పరిశీలించేందుకు అక్కడికి చేరుకునే సరికి వరి కుప్పలు తగలబడుతూ కనబడ్డాయి. వెంటనే పామర్రు మండల అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. సుమారు రూ.3.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్ని మాపక అధికారి ఎస్.రాంబాబు తెలిపారు.

జగనన్న పాలనలో సమన్యాయం

'గడప గడపకు మన ప్రభుత్వం'లో కామయ్యతోపు నివాసితులు వెల్లడి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగనన్న అధికారం చేపట్టిన తర్వాత పేద, మధ్య తరగతి వర్గాలకు న్యాయం జరుగుతుందని పి.సంపూర్ణ, నీలం మేరీ అన్నారు. కానూరు కామయ్యతోపు సచివాలయం 3 పరిధిలో సోమవారం ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందజేసి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ పాదయాత్రలో జగనన్న ఇచ్చిన హామీల మేరకు నవరత్నాలు అమలు చేశారన్నారు. అమ్మ ఒడి, చేయూత, సున్నావడ్డీ, కాపునేస్తం, ఆసరా, పింఛన్, ఇంటి స్థలం ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. జగనన్నపాలనలో పేద కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయని తెలిపారు.

అన్ని వర్గాలకు మేలు..

జగనన్న పాలనలో అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేశారన్నారు. ప్రధానంగా నవరత్నాలతో అనేక సంక్షేమ పథకాలు అర్హులకు అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందని తెలిపారు. కులమతాలు,రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. టీడీపీ వర్గాలకు కూడా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీ పేరుతో దోచుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో తాడిగడప మునిసిపాలిటీ కమిషనర్ ఎన్.ప్రకాశరావు, వైఎస్సార్‌సీపీ నేతలు అన్నే శ్రావణ్‌కుమార్, వేమూరి బాలకృష్ణ, తుమ్మల వరదీష్, పీజే కిషోర్, సుబ్బరాజు, అంగిరేకుల సీతారామయ్య పాల్గొన్నారు.

పెనమలూరు సీఐ బదిలీ

కొత్త సీఐగా కిషోర్‌బాబు



పెనమలూరు: పెనమలూరు సీఐగా పని చేస్తున్న ఆర్.గోవిందరాజు సోమవారం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పమిడిముక్కల సీఐగా ఉన్న ఎం.కిషోర్‌బాబును పెనమలూరు సీఐగా నియమిస్తూ జిల్లా ఎస్పీ పి.జాషువా ఉత్వర్వులు జారీ చేశారు. పెనమలూరు సీఐగా గోవిందరాజులు గత పది నెలలుగా పెనమలూరులో సీఐగా పని చేశారు. అయితే ఇటీవల పోరంకిలో ఇంట్లో పనిచేసే బాలిక వివాదాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినా ఇంటి యజమాని కాకర్ల రామకృష్ణను అరెస్టు చేయకపోవటంతో పోలీసుల తీరు పై వివాదం తలెత్తింది. ఇంటి యజమాని ఇప్పటికి పరారీలోనే ఉన్నాడు. పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిపాలన కూడా ఆశించిన స్థాయిలో ఉండటం లేదని ఉన్నతాధికారులు సైతం అసంతృప్తిగా ఉన్నారని సమాచారం. ఈ నేపథ్యంలో గోవిందరాజును ఏలూరు రేంజ్‌కు వీఆర్‌గా పంపినట్లు తెలుస్తోంది.

ఆసరాతో ఆర్థిక భరోసా



ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నాని

ఉయ్యూరు: ఆసరాతో ఆర్థిక భరోసా లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. పట్టణంలోని 4, 5 వార్డుల్లో ఆసరా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి సొమ్ము చేస్తూ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. డ్వాక్రా సంఘాలకు విడతల వారీగా రుణమాఫీ చేసి ఆసరా కల్పిస్తున్నారన్నారు. సీఎం జగన్ ప్రభుత్వానికి బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, ప్రభుత్వాస్పత్రి చైర్మన్ జంపాన కొండలరావు, ఐదో వార్డు ఇన్‌చార్జి దిరిశం జ్యోతిర్మయి, నాయకులు బాబ్జీ, పూర్ణ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.